## క్లుప్తంగా

### నేడు సినీ పాటల పోటీలు

పెనుగొండ: ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి సినీ పాటల పోటీలను మహర్షి సాత్యవతేయ విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఇరగవరం మండలం అయితంపూడిలో ప్రారంభమవుతాయని పరిషత్ అధ్యక్షుడు రంకిరెడ్డి రామ్మోహనరావు ఓ ప్రకటనలో తెలిపారు. విజేతలకు షీల్డ్‌లతో పాటు, నగదు బహుమతులు ఇస్తామని, ట్రాక్‌పై పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రవేశ రుసుం రూ.200ని, పూర్తి వివరాలకు కన్వీనర్ చివటం సుబ్బారావు, సెల్ నంబర్ 9849528590లో సంప్రదించాలని కోరారు. ఆదర్శ రైతు రంకిరెడ్డి వీరన్న, సత్యవతిల జ్ఞాపకార్థం ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

### పింఛన్ల పంపిణీ 96 శాతం పూర్తి

పాలకొల్లు అర్బన్: మండలంలోని పింఛన్ల పంపిణీ 96 శాతం పూర్తయినట్టు ఎంపీడీఓ ఎస్ఎస్ ఉమామహేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిగిలిన లబ్ధిదారులకు బుధ, గురువారాల్లో పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

**మొగల్తూరులో 90 శాతం పూర్తి**

మొగల్తూరు: సామాజిక పింఛన్ల పంపిణీ 90 శాతం పూర్తయినట్టు ఎంపీడీఓ సీహెచ్ త్రిశూల పాణి మంగళవారం తెలిపారు.



# న్యూ ఇయర్ సందడి

నరసాపురం, పాలకొల్లు, ఆచంట నియోజకవర్గాల్లో నూతన సంవత్సర సందడి నెలకొంది. పట్టణ, మండల కేంద్రాల్లో మంగళవారం రాత్రి రంగులు, పువ్వులు, కేకులు, రంగులు అమ్మకాలు జోరుగా సాగాయి. హోటళ్లు వద్ద బిర్యానీలు ఆఫర్లు పెట్టి కొనుగోలు దారులను ఆకర్షించారు. మద్యం షాపుల వద్ద మద్యంప్రియుల సందడి నెలకొంది. పాలకొల్లు పట్టణంలోని పలు కూడళ్లలో రాత్రి ట్రాఫిక్ జామవడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. పథకాల అమలుకు ప్రభుత్వం మీన మేషాలు లెక్కిస్తూ కాలం గడుపుతూ వస్తుండడంతో లబ్ధిదారుల్లో నిరాశ వ్యక్తమైంది. కొత్త సంవత్సరంలోనైనా ప్రజా సంక్షేమంపై కూటమి ప్రభుత్వం శ్రద్ధ పెడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. – నరసాపురం / పాలకొల్లు సెంట్రల్ / పెనుగొండ



పాలకొల్లు : యడ్లబజారు సెంటర్లో రాత్రి 7.30కు ట్రాఫిక్

నరసాపురం, పాలకొల్లు పట్టణాల్లో రంగుల విక్రయాలు



పెనుగొండ : కేకల దుకాణం



పెనుగొండ : సిద్ధాంతంలో చికెన్ వంటకాల విక్రయం



పాలకొల్లు : స్వీట్ షాపులో వినియోగదారుల రద్దీ

# ప్రజలందరికీ మేలు జరగాలి

పాలకొల్లు అర్బన్: నూతన సంవత్సరంలో పాలకొల్లు నియోజకవర్గంలోని ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) కోరారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ శ్రేణులకు, ప్రజలకు, అధికారులకు గోపి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కూటమి ప్రభుత్వం మోసపూరిత హామీలిచ్చిందని, దీంతో ప్రజలు సంక్షేమ ఫలాలకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.

**న్యూ ఇయర్‌కు స్వాగతం**

పెనుగొండ: కొత్త సంవత్సరంలో ప్రజలందరికీ మంచి జరగాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు వైట్ల కిషోర్ అన్నారు. మంగళవారం ఆచంటలో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కేక్ కట్ చేశారు. నాయకులు మనవర్తి విజయ్ కుమార్, గొడవర్తి చంద్రశేఖర్, తప్పెట్ల వెంకట్రావు, ఉల్లం రామానుజం, మనవర్తి శుభాకరరావు, గొడవర్తి కృష్ణ కుమార్, వస్కా ఉమేష్, నుంగిన శ్రీనివాస్, నార్గన శ్రీనివాస్, బాలిన వీరాస్వామి, మాముడూరి శ్రీనివాస్, మండి మహేష్, చిట్టియ్య, కేతా రామకృష్ణ, మంగిన ఆంజనేయులు, చామన శ్రీనివాస్, అరిగెల సురేష్ పాల్గొన్నారు.



ఆచంటలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

# రూ.68.29 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం

- రూ.64,05,50,000 ఖర్చు
- రూ.4,23,74,821 మిగులు
- రోడ్లు, తాగునీటి అవసరాలకు నిధుల కేటాయింపు
- రసాభాసగా నరసాపురం మున్సిపల్ సమావేశం



మాట్లాడుతున్న శ్రీవెంకటరమణ



ఎమ్మెల్యే నాయకర్ సమక్షంలో వాగ్వివాదానికి దిగిన కౌన్సిలర్లు

నరసాపురం: 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.68,29,24,821 అంచనా బడ్జెట్‌కు నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ అధ్యక్షతన మంగళవారం బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ప్రారంభ నిల్వ రూ.15,46,35,121 ఉండగా, రాబోయే ఆర్థిక సంవత్సరంలో పన్నులు, ప్రభుత్వ గ్రాంట్లు తదితర పద్దుల ద్వారా రూ.52,82,89,700 ఆదాయం సమకూరుతుందని అంచనా వేశారు. ఏడాది మొత్తం రూ.64,05,50,000 ఖర్చవుతుందని తేల్చారు. రూ.4,23,74,821 మిగులు చూపపించారు. ఆర్థిక సంఘం నిధులు, ప్రభుత్వ గ్రాంట్లు, జనరల్ ఫండ్స్‌ను రోడ్లు, డ్రెయిన్లు, మంచినీటి సరఫరా మెరుగుదలకు వాటికి ఖర్చు చేయాలని నిర్ణయించారు.

**సమావేశం వాయిదాకు పట్టు**

బడ్జెట్ సమావేశం, అనంతరం జరిగిన సాధారణ సమావేశాలు రసాభాసగా మారాయి. గత బడ్జెట్ ఫార్మెట్‌ను మార్చి ఇచ్చేసారి, ఇందులో కొత్త లేదని పలువురు కౌన్సిలర్లు ఆరోపించారు. సమావేశం వాయిదా వేయాలని పట్టుపట్టారు. ఈలోపు సమావేశానికి ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ హాజరయ్యారు. ఇకపై అలాంటి తప్పులు జరక్కుండా చూసుకోవాలని, సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించడంతో గొడవ సర్దుమణిగింది. ఇది పూర్తిగా అధికారుల వైఫల్యమని కౌన్సిలర్ వైకేఎస్ ఆరోపించారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని వన్నెంరెడ్డి శ్రీనివాస్, ఏటిగట్టు అభివృద్ధి పనులు పూర్తి చేయించాలని మల్లాడి వేషవేణి, తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని వైస్ చైర్మన్ కొత్తపల్లి నాని, మున్సిపల్ కార్యాలయం వద్ద తడి, పొడి చెత్తను వేరుచేసే యూనిట్ తాత్కాలికంగా ఏర్పాటు చేయడం తగదని వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని, పట్టణంలో ఎక్కడబడితే అక్కడ పట్టపగలు కూడా దొంగతనాలు చోటుచేసుకుంటున్నాయని, పోలీస్‌శాఖకు చెప్పి సమస్య పరిష్కరించాలని కావలి రామసీత ఎమ్మెల్యే సమక్షంలో ప్రశ్నించారు. పలు సమస్యలపై కౌన్సిలర్లు కోటిపల్లి సురేష్, సఖినేటిపల్లి సురేష్, యర్రా ఉమ, కేసరి గంగరాజు, అడిదల శ్యామల, జిల్లెళ్ల దిలీప్, పాలూరి బాబ్జి, షేక్ యాకూబీబీ, అబేధాసుల్తానా, బర్రి జయరాజు, ద్వారా గంగాభవాని, సోమరాజు దుర్గా భవాని, పతివాడ పద్మ, సిర్రా కాంతమ్మలు ప్రశ్నించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీవెంకటరమణ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని బడ్జెట్ కేటాయింపులు చేశామని వివరించారు.

# సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

నరసాపురం రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ మైలాబత్తుల సోనీ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలు విజయవంతం కావాలంటే సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలను భాగస్వామ్యం చేయాలన్నారు. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉపాధి హామీ నిధులు రూ.7 కోట్లతో చేపట్టిన రోడ్లు, డ్రెయిన్ల పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా ఎంపీటీసీలు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు కట్‌చేసి అందరికీ పంచారు. సమావేశంలో జెడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ, మత్స్య సహకార సంఘాల జిల్లా అధ్యక్షుడు మైల వసంతరావు, వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ ప్రెసిడెంట్ గుబ్బల మార్రాజు, వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్ నాయుడు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎంపీపీకి కేకు తినిపిస్తున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్, చిత్రంలో ఎమ్మెల్యే నాయకర్

### వాకర్స్‌ను ఢీకొన్న బైక్

పెనుమంట్ర: స్థానిక రాజీవ్ కాలనీ వద్ద మంగళవారం ఉదయం మార్నింగ్‌వాక్ చేస్తున్న దంపతులను మోటారు సైకిలిస్ట్ వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో వాకర్ దివాకర్ల లక్ష్మి, మోటారు సైక్లిస్టు గోవింద్ తీవ్ర గాయాలయ్యాయి. పెనుమంట్రకు చెందిన రిటైర్డు టీచర్ దివాకర్ల రాధాకృష్ణ ఆయన భార్య లక్ష్మీ బ్రాహ్మణ చెర్వు వైపు మార్నింగ్ వాక్ చేస్తున్నారు. ఆ సమయంలో పాలూరుకు చెందిన గోవింద్ మోటారు సైకిల్‌పై వస్తూ వెనుక నుంచి ఢీకొట్టాడు. తీవ్ర గాయాలపాలైన గోవింద్‌ను 108 వాహనంలో తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, లక్ష్మిని ప్రైవేటు వాహనంలో తణుకులో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం నుంచి రాధాకృష్ణ తృటిలో తప్పించుకున్నారు.

### స్థానికంగా ఉండని పంచాయతీ కార్యదర్శి

నరసాపురం రూరల్: నరసాపురం మండలం ఎల్బీచర్ల మేజర్ పంచాయతీ కార్యదర్శి పాతర్తి లక్ష్మీపతిరాజు స్థానికంగా నివాసం ఉండకుండా భీమవరం నుంచి విధులకు హాజరవుతున్నారని, ఇది సరికాదని పంచాయతీ 5వ వార్డు మెంబర్, వైఎస్సార్ సీపీ నాయకుడు బొడ్డు ఆశీష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. పంచాయతీ సమీపంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల వల్ల పలు ఇబ్బందులు తలెత్తుతున్నా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. కాలువల్లో గుర్రపుడెక్క, తూడు తొలగింపునకు విషపూరితమైన రసాయనాలను పిచికారీ చేయడం వల్ల మత్స్యసంపద నష్టపోతున్నామని వివరించారు. తాగునీరు కూడా కలుషితమవుతుందని, పశువులు మృత్యువాత పడుతున్నాయని పేర్కొన్నారు. వీటిపై సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఆశీష్‌కుమార్ కోరారు.



ఎల్బీచర్ల సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

# వాసవీ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

నరసాపురం: వాసవీక్లబ్ నరసాపురం శాఖ 2025 సంవత్సరానికి నూతన కార్యవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమం మంగళవారం రాత్రి స్థానిక అప్పన ప్లాజాలో ఘనంగా నిర్వహించారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడిగా బీజీబీఎస్ మహిళా కళాశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్, కార్యదర్శిగా కంచర్ల మురళీకృష్ణ బాజ్జీ, ట్రెజరర్‌గా కోట్ల బాలకృష్ణ, జోన్ చైర్మన్‌గా అప్పన బదిరీ సుబ్బారావు, డీపీఓగా మండ రాజా ప్రమాణ స్వీకారం చేశారు. క్లబ్ గవర్నర్ ఎస్‌పీఎస్ఎస్ ప్రసాద్ నూతన కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్ ఇంటర్నేషనల్ ఫాస్ట్ ప్రెసిడెంట్ నూలి వెంకటరమణమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కొత్త ఏడాదిలో సేవా కార్యక్రమాలు మరింత పెద్ద ఎత్తున చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఆత్మూరి వెంకటనర్సయ్య, మండ రాజా, గుడివాడ రాధాకృష్ణ, అప్పన బదిరీ, మహిళా విభాగం ప్రతినిధి కనగర్ల రామలీల పాల్గొన్నారు.



ప్రమాణస్వీకార కార్యక్రమంలో మాట్లాడుతున్న వెంకటరమణమూర్తి